సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం, 4, అక్టోబర్, 2024



పత్తి రైతు చిత్తు

వరుస తుఫాన్లకు పత్తి రైతు చిత్తయిపోయాడు. తెగుళ్లు ఆశించడంతో నష్టపోతున్నాడు. - 8లో



కొనసా..గుతున్న బదిలీలు

రెవెన్యూలో బదిలీలు ఇంకా కొనసాగుతున్నాయి. గత నెల 22న పూర్తి కావాల్సి ఉన్నా కాలేదు. - 8లో

వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ అప్పలరాజు



కాశీబుగ్గ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

న్యూస్‌రీల్

రైల్వే సొత్తు చోరీ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధి తిలారు–ఆమదాలవలస మధ్యలో రైల్వే కమ్ములు, తదితర వస్తువులు చోరీ చేసి విక్రయించిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు శ్రీకాకుళంరోడ్ రైల్వేస్టేషన్ ఆర్‌పీఎఫ్ ఓ.మనోజ్ కుమార్ గురువారం తెలిపారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. సారవకోట మండలం కిమిడి బుడితి గ్రామానికి చెందిన మేదర మహేంద్ర అనే వ్యక్తి కోటబొమ్మాళి మండలం కిష్టప్పపేట గ్రామంలో సచివాలయ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన తిలారు సమీపంలో రైల్వే కమ్మీలను చోరీ చేసి సారవకోటలో విక్రయాలు చేస్తుండగా సారవకోటలో ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే అతడిని అరెస్టు చేయకుండా దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు చెప్పడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితుడు మంత్రి, ఎంపీలతో పెద్ద స్థాయిలో రికమండేషన్ చేయించుకుంటూ కేసు నుంచి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

2047 నాటికి సంపన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వర్ణాంధ్ర–2047 సాధనకు అందరి భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. జిల్లాలో ఆర్థిక, సామాజిక, సాంకేతిక ప్రగతి కోసం సూచనలు స్వీకరించేందుకు వర్క్‌షాప్ ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి ఆయన గురువారం అభిప్రాయ సేకరణకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అతి పొడవైన తీరం ఉందని దీన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. జిల్లాలో పరిశ్రమలు స్థాపిస్తే పరిశ్రమల్లో పని చేయడానికి టెక్నికల్ స్టాఫ్ అవసరం అవుతుందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కోర్సులు, పాలిటెక్నికల్, ఐటీఐ చేసిన వారికి జిల్లాలోనే ఉపాధి కల్పించే అవకాశం ఉందన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ సాయంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. పలాసకు చెందిన రైతు మాట్లాడుతూ ఇటీవల తాను నూతన పద్ధతులను తెలిపే ఒక టీమ్‌ను బెంగళూరు నుంచి తీసుకువచ్చానని, వారు చెప్పిన పద్ధతిలో పండిస్తే దిగుబడి బాగుందన్నారు.

దాడిపై ఎస్పీకి ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్ మేనేజర్ సాధు ధనుంజయరావుపై జరిగిన దాడి ఘటన విషయమై ఆంధ్రప్రదేశ్ (ఏపీ) హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీని కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఎస్పీని కలిసిన వారిలో మెట్ట నాగరాజు, కెల్ల చిన్నికిశోర్, నక్క రామరాజు, బాధితుడు సాధు ధనుంజయరావు ఉన్నారు.

చంద్రబాబు చేసింది శూన్యం

శ్రీకాకుళం అర్బన్: వంద రోజుల పాలనలో చంద్రబాబు చేసింది శూన్యమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని, కానీ చంద్రబాబు చెప్పినట్లుగా గొడ్డు మాంసం, చేప మాంసం, పంది మాంసమో లేదని, ఇది శుద్ధ అబద్ధమన్నారు. ఈ నెయ్యిలో కలుపుతున్నది మాత్రం వెజిటేరియన్ నూనె అని తెలిపారు. సీఎం చంద్రబాబు అమరావతిలో రూ.వేల కోట్లు పోసేస్తున్నారని, అమరావతి కృష్ణానదిలో ఉందని, రూ.175 కోట్లు పెట్టి సచివాలయాలు కట్టారని, కట్టాలనుకున్నదానికంటే ఐదింతలు పెరిగిందని, దాదాపు రూ.900 కోట్లతో 5బ్లాకులు కట్టారన్నారు. తెలంగాణ, కర్నాటకలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతోందని, రాష్ట్రంలో ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

సుడా వైస్ చైర్మన్‌గా జేసీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) వైస్ చైర్మన్‌గా జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల వీసీగా ఉన్న చల్ల ఓబులేసుకు బదిలీ కావడంతో అదనపు బాధ్యతలను జేసీకి అప్పగించారు.





కోటబొమ్మాళి కొత్తమ్మతల్లిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు దంపతులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ తదితరులు



అమ్మకు ఘటం.. అద్భుత ఘట్టం

శిరసున ఘటం, మనసున అమ్మవారి చిత్ర పటం, అడుగు అడుగునా తల్లి మంత్ర పఠనం, ఆలయ దారిన ఆవిష్కృతమైన ఈ అపురూప ఘట్టం కొత్తమ్మ తల్లి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాల చివరి రోజైన గురువారం అమ్మవారికి ఘటాలు, ముర్రాటలు సమర్పించారు. దాదాపు ఐదు లక్షల మంది కోటబొమ్మాళి వచ్చి కొత్తమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయంతో పాటు ఊరు ఊరంతా గురువారం జనయేరును తలపించింది.

– టెక్కలి, కోటబొమ్మాళి



ఇచ్ఛాపురం: ఆలయంలో శైలపుత్రికగా దర్శనమిస్తున్న స్వేచ్ఛావతి అమ్మవారు



శ్రీకాకుళం మొండేటివీధిలో బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవారు

శక్తి స్వరూపిణి

దసరా నవరాత్రులు మొదలయ్యాయి. ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు అపురూప అలంకరణలతో దర్శనమిస్తున్నారు. దీనికి తోడుగా మండపాల్లోనూ అంతెత్తున విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు.



నరసన్నపేట: ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా కారు స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



గార: శ్రీకూర్మనాథాలయంలో వైష్ణవీ దుర్గకు పూజలు

రఫ్ఫాడిస్తున్నారు



- క్రికెట్‌లో సత్తాచాటుతున్న శ్రీకాకుళం కుర్రాళ్లు
- అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీల్లో ఏటా ప్రాతినిధ్యం
- తాజాగా ముగ్గురు క్రీడాకారులు ఆంధ్రా జట్లకు ఎంపిక
- రంజీ టోర్నీకి త్రిపురాణ విజయ్
- ఆంధ్రా అండర్–19 జట్టుకు నంబళ్ల సుశాంత్, రాజన జున్నారావు ఎంపిక

మన క్రికెటర్లు రఫ్ఫాడిస్తున్నారు. అదరగొట్టే ఆటతీరుతో ఐపీఎల్ తలుపులు తడుతున్నారు. తద్వారా టీమిండియా కలను సాకారం చేసుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నేళ్లుగా మన ఆటగాళ్లు అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీల్లో నిలకడగా రాణిస్తున్నారు. వీరిలో ముగ్గురు ఇప్పటికే ఆంధ్రా తరఫున ఆడుతున్నారు. బీసీసీఐ నిర్వహించే ప్రతిష్టాత్మక రంజీ టోర్నీకి త్రిపురాణ విజయ్ ఎంపికవ్వగా, బీసీసీఐ నిర్వహించే అంతర్రాష్ట్ర వినూ మన్కడ్ అండర్–19 వన్డే క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రా జట్టుకు నంబళ్ల సుశాంత్, రాజన జున్నారావు ఎంపికయ్యారు. ఇందులో విజయ్, సుశాంత్ టాపార్డర్ బ్యాటర్లు కమ్ స్పిన్నర్లు కాగా, జున్నారావు మీడియం పేసర్. ఇక్కడి నుంచి ఐపీఎల్‌కు అక్కడి నుంచి జాతీయ జట్టుకు ఎంపిక కావడమే లక్ష్యంగా కఠోరంగా శ్రమిస్తున్నారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ

రంజీ టోర్నీకి 'విజయ్'



టెక్కలిలోని అయ్యప్ప నగర్‌కు చెందిన వర్ధమాన క్రికెటర్ త్రిపురాణ విజయ్ మరోసారి ప్రతిష్టాత్మక రంజీ టోర్నీకి ఎంపికయ్యాడు. బీసీసీఐ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర పురుషుల రంజీ క్రికెట్ టోర్నీలో పాల్గొనే జట్టులో ఈ యువ క్రికెటర్ చోటు దక్కించుకున్నాడు. రెండేళ్ల క్రితం రంజీల్లో ఆడిన విజయ్ మరోసారి ఆ అవకాశాన్ని అందిపుచ్చుకున్నాడు. గత కొన్ని సీజన్ల నుంచి సయ్యద్ ముస్తాక్ ఆలీ టీ–20 క్రికెట్ టోర్నీతోపాటు అన్ని వయో విభాగాల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి ఆంధ్రా జట్టుకు త్రిపురాణ విజయ్ ఒక్కడే ఎంపికయ్యాడు. బ్యాటింగ్, బౌలింగ్‌తోపాటు ఫీల్డింగ్‌తో రాణిస్తుండటం విజయ్‌కు కలిసి వస్తోంది. త్రిపురాణ వెంకట కృష్ణరాజు, లావణ్యలు విజయ్ తల్లిదండ్రులు. తండ్రి సమాచారశాఖలో ఉద్యోగిగా పనిచేస్తుండగా తల్లి గృహిణి. ప్రస్తుతం విజయ్ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. జాతీయ జట్టుకు ఎంపికే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాడు.

సెంచరీల వీరుడు 'సుశాంత్'



జిల్లాకు చెందిన నంబళ్ల సుశాంత్ మరో స్టార్ క్రికెటర్‌గా ఎదుగుతున్నాడు. ఇటీవల జరిగిన అంతర్‌జిల్లా అండర్–19 త్రీడేస్ టోర్నీ, వన్డే టోర్నీల్లో తన భీకరమైన ఫామ్‌ను కొనసాగించి సెంచరీల మోత మోగించాడు. అంతర్రాష్ట్ర అండర్–19 వన్డే క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రా జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల అహ్మదాబాద్ వేదికగా రిలయన్స్ సంస్థ సహకారంతో బీసీసీఐ ఆధ్వర్యంలో జరిగిన టోర్నీలో మెరిశాడు. అంతర్‌జిల్లాల క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం జిల్లా కెప్టెన్‌గా వ్యవహరిస్తునే వన్డే టోర్నీలో 5 మ్యాచ్‌ల్లో 341 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అలాగే త్రీడేస్ టోర్నీలతో కలిపి ఐదు సెంచరీలతో కదంతొక్కాడు. బ్యాటింగ్‌తోపాటు తన స్పిన్ మ్యాజిక్‌తో బౌలింగ్‌లోను అదరగొడుతున్నాడు. సుశాంత్ స్వస్థలం టెక్కలి. ప్రస్తుతం శ్రీకాకుళంలో నివాసం ఉంటున్నారు. బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. తండ్రి నంబళ్ల జగదీష్ శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, తల్లి అర్చన గృహిణి.

పేస్ బౌలింగ్ దళపతి 'జున్నారావు'



తన అద్భుతమైన పేస్ బౌలింగ్‌తో విశేషంగా వెలుగులోకి వచ్చిన మరో క్రికెటర్ రాజన జున్నారావు. బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించే ఈ యువ సంచలనం శ్రీకాకుళం నగరవాసి. ఇప్పటికే అండర్–14, 16, 19 టోర్నీల్లో రాణిస్తూ వస్తున్నాడు. ఇటీవల జరిగిన ఏసీఏ అంతర్‌జోనల్, అంతర్‌జిల్లా అండర్–19 త్రీడేస్, వన్డే క్రికెట్ టోర్నీల్లో అత్యద్భుతంగా ఆకట్టుకున్నాడు. ఇటీవలి సీజన్‌లో అత్యధిక వికెట్లను సాధించాడు. దీంతో బీసీసీఐ నిర్వహించే అంతర్రాష్ట్ర అండర్–19 క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఏసీఏ ఆంధ్రా అండర్–19 పురుషుల జట్టుకు ఎంపికయ్యాడు. ఐపీఎల్‌కు ఎంపికే లక్ష్యంగా దూసుకెళ్తున్నాడు.

5, 6 తేదీల్లో బస్‌పాస్ జారీ ఉండదు

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులకు జారీ చేస్తున్న బస్‌పాస్‌ల సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్న కారణంగా ఈ నెల 5, 6వ తేదీల్లో విద్యార్థులకు ఎలాంటి బస్‌పాస్‌లు జారీ చేయడం జరగదని, ఈ విషయం విద్యార్థులు గ్రహించి సహకరించాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్‌పాస్‌ల కోసం పాత వెబ్‌సైట్ స్థానంలో కొత్త సైట్‌ను అందుబాటులోకి తీసుకుని వస్తున్నామని చెప్పారు. జిల్లా పరిధిలో మంత్లీ సీజన్ టిక్కెట్ (ఎంఎస్‌టీ) లపై తిరిగే ప్రయాణికులకు పాసుల మంజూరు మరింత సులభతరం చేసేందుకు వెబ్‌సైట్ పనితీరును/నాణ్యతను మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. ఈ వెబ్‌సైట్ ఈ నెల 5–6వ తేదీల్లో పని చేయదని, 7వ తేదీ నుంచి యథావిధిగా బస్‌పాస్‌ల జారీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కొత్త పాసులు మంజూరు కోసం విద్యార్థి చదువుతున్న విద్యాసంస్థ నుంచి స్టడీ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు నకలుతో దరఖాస్తు చేసి బస్ పాస్ కౌంటర్ వద్దకు వచ్చి పొందవచ్చని తెలిపారు.

డ్రోన్ పిచికారీ విజయవంతం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు అంతరకుడ్డ గ్రామంలో గురువారం పంట పొలంలో డ్రోన్‌తో పిచికారీ చేసే పద్ధతిని ప్రారంభించారు. గ్రామానికి చెందిన మాజీ సైనికుడు అట్టాడ మాధవరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ సబ్సిడీలో తీసుకువచ్చిన డ్రోన్‌తో శిక్షకుడు వరి పంటకు పురుగు మందు పిచికారీ చేసి చూపించాడు. ఇటీవల సాంబ మసూరి పంటకు దోమ పోటు పెరగడంతో నివారించడానికి ఈ పద్ధతిని ప్రయోగాత్మకంగా ప్రారంభించగా విజయవంతమైంది.



అంతరకుడ్డ పంటపొలంలో సాంబమసూరికి పురుగు మందు పిచికారి చేస్తున్న డ్రోన్

తల్లి సేవలో పల్లె

- గ్రామ దేవతల సేవల్లో ప్రజలు
- అమ్మవారి ప్రతి రూపంగా తులసీ దళం, పోక చెక్కకు పూజలు
- తొమ్మిది రోజుల పాటు గ్రామాల్లో ఆధ్యాత్మికత



గ్రామంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన పిండి వంటల నైవేద్యం

ఇచ్ఛాపురం రూరల్: ఊరి పొలిమేరలో అమ్మోరును స్వాగతించారు. అమ్మా.. ఊరికి రా.. అంటూ మేళతాళాలతో అంగరంగా వైభవంగా బాణసంచా వెలుగుల మధ్య ఆహ్వానించి తొమ్మిది, ఏడు, ఐదు, మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలకు సిద్ధమయ్యారు. పోలాల అమావాస్య తర్వాత జిల్లాలోని పల్లెలన్నీ తల్లిని పూజించే క్రతువులో పడ్డాయి. ఈ తొమ్మిది రోజుల పాటు రకరకాల పిండివంటలు, కోలాటాల మధ్య పల్లెలు పులకించి పోతాయి. ముఖ్యంగా ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో ఉండే ఉత్కళాంధ్రులు ఘనంగా ఉత్సవాలు జరుపుకుంటారు.

పోక చెక్క.. తులసీ దళం..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు 'పోక చెక్క, తులసీ దళం'ను అమ్మవారి ప్రతి రూపంగా కొలుస్తారు. పోలాల అమావాస్య రోజున జన్ని పూజారి ఆలయంలో గ్రామ దేవత ముందు తులసీ దళంను ఉంచి, దానిపై పోక చెక్క కాయను ఉంచుతారు. దాని చుట్టూ గ్రామ పెద్దలు భక్తి శ్రద్ధలతో తమ రెండు చేతులను ఉంచుతూ తమ చేతిలో ఈ పోక చెక్క కాయ పడాలని వేడుకుంటారు. ఈ సమయంలో సన్నాయి మేళంతో అమ్మవారిని తృప్తి పరిస్తే పోక చెక్క కాయ ఎగిరి గ్రామ పెద్దల చేతుల్లో పడుతుంది. తులసీదళం, పోక చెక్క కాయను ప్రత్యేకంగా అలంకరించిన జంగిడిలో పెట్టి గ్రామంలోకి మేళతాళాలు, బాణసంచా వెలుగులు మధ్య తీసుకువస్తారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆముదంతో తయారు చేసిన కాగడాలతో పొలిమేరలో అమ్మవారికి స్వాగతం పలుకుతారు. తొమ్మిది రోజులు పూర్తయిన తర్వాత దసరా రోజున అమ్మవారిని పొలిమేర దాటిస్తారు. ఈ సమయంలో అమ్మవారి పాదాలు కందకుండా పచ్చని చెట్ల కొమ్మలు, వేప కొమ్మలు వేస్తారు, భక్తులు పసుపు, కుంకుమ నీటితో పూజారి పాదాలు కడిగినప్పుడు తడిసిన పచ్చని కొమ్మలను పొలాల్లో నాటుతారు.



పంట పొలాల్లో వేసేందుకు అమ్మవారి ముందు ఉంచిన పత్రి కొమ్మలు

క్లుప్తంగా

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడి పర్యటన నేడు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కమిషన్ కార్యదర్శి ఎస్.పద్మజ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్, ఎస్పీలతో భేటీలతో పాటు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కార్యాలయంలో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల పెండింగ్ బస్‌లు, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తల్లి పాల కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ సారథ్యంలో జిల్లాలో దివ్యాంగ బాలలకు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల సమీక్షలో పాల్గొంటారని, మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా ఇంటర్మీడియట్ ఆర్ఐఓ నేతృత్వంలో బాలల హక్కుల పరిరక్షణలో జిల్లా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్ల పాత్రపై జరగనున్న అవగాహన కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

క్విజ్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం కల్చరల్: భారత జాతీయ కళలు, సంస్కృతి వారసత్వ సంస్థ (ఇంటాక్) శ్రీకాకుళం చాప్టర్ నిర్వహించిన క్విజ్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు బుధవారం బహుమతులు అందించారు. డచ్ భవనం వద్ద జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు, అదనపు కన్వీనర్ జగన్నాథంనాయుడు, నటుకుల మోహన్, సభ్యులు హారికా ప్రసాద్, కొమ్ము రమణమూర్తి, పొన్నాడ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఒడిశాకు ఇసుక అక్రమ తరలింపు



రాయల కూడలి వద్ద ఒడిశాకు తరలించేందుకు నిల్వ చేసిన ఇసుక కుప్పలు

కొత్తూరు: కొత్తూరు మండలం రాయల దిమిలి గ్రామం కూడలి సమీపంలో నిల్వ చేసిన ఇసుకను ఒడిశా రాష్ట్రం సీతాపురం, మిలగాం, పర్లాకిమిడితో పాటు పలు గ్రామాలకు అక్రమంగా ట్రాక్టర్‌పై తరలిస్తున్నారు. మండలంలోని పొనుటూరు గ్రామం వంశధార నది నుంచి నాటు బళ్లపై రాయల–దిమిలి కూడలి వద్దకు తీసుకు వచ్చి నిల్వ చేస్తున్నారు. నిల్వ చేసిన ఇసుకను ప్రతి రోజూ వేకువజామున, సాయంత్రం వేళల్లో ట్రాక్టర్లకు లోడ్ చేసి ఒడిశాలోని గ్రామాలకు తరలిస్తున్నారు. ప్రధాన రహదారి మీదుగానే వాహనాలు వెళ్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

అధికారుల కోసం ప్రజల నిరీక్షణ



అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీల ఎదుట కూర్చున్న వేతనదారులు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ సచివాలయంలో గురువారం నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభకు అధికారుల రాక కోసం ప్రజలు నిరీక్షించారు. గ్రామసభ 11 గంటలకు జరుగుతుందని వేతనదారులకు తెలియజేయగా పలువురు సచివాలయానికి హాజరయ్యారు. అయితే గ్రామసభ నిర్వహించాల్సిన పంచాయతీ కార్యదర్శి హిమబిందు 12.30 గంటలకు రావడంతో వేతనదారులు నిరీక్షించాల్సి వచ్చింది. అయితే తాను కిన్నెరవాడ సచివాలయానికి ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వర్తిస్తున్నందున లక్ష్మీపురంలో గ్రామసభ నిర్వహించుకుని వచ్చేటప్పటికీ ఆలస్యం అయినట్లు ఆమె తెలిపారు.

సెంచూరియన్‌లో ఆప్టోమెట్రీపై సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ కుమారస్వామి

నెల్లిమర్ల రూరల్: ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఆప్టోమెట్రీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్వామి కంటి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి స్వదేశీ బ్రాండ్, ఉత్పత్తి, పరిశోధన, అభివృద్ధిని సృష్టించడం తదితర ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.







దసరా కథ.. అద్భుతం కదా

దసరా వేడుకలను పురస్కరించుకుని శ్రీకాకుళం పాత హౌసింగ్ బోర్డుకాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. దసరా పండుగ జరుపుకోవడం వెనుక ఉన్న రెండు చారిత్రక కథలను ప్రదర్శించి మంత్రముగ్ధులను చేశారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ

పత్తి రైతు చిత్తు



కొత్తూరులో తుఫాన్‌కు నష్టపోయిన పూత దశలో ఉన్న పత్తి పంట (ఇన్‌సెట్లో) సిరుసవాడలో తుఫాన్‌కు రాలిపోయిన పత్తి పంట పిందెలు

- వరుస తుఫాన్‌లతో పత్తి పంటకు అపార నష్టం
- ఆందోళన చెందుతున్న రైతులు

కొత్తూరు:

ఇటీవల వరుసగా వచ్చిన తుఫాన్లు పత్తి పంటకు అపార నష్టం చేకూర్చాయి. జిల్లాలో సాగు చేస్తున్న వాణిజ్య పంటల్లో పత్తి పంట ఒకటి. కొత్తూరు, హిరమండలం, లావేరు, పొందూరు, ఎచ్చెర్ల, సంతకవిటి, సరుబుజ్జిలి మండలాలతో పాటు పలు మండలాల్లో సుమారు 60 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. పూత దశ నుంచే వర్షాలు కురిశాయి. దీంతో పువ్వు, పిందెలు రాలిపోయాయి. మొదటి కాపులో వచ్చిన ముదురు కాయలు చాలా వరకు కుళ్లిపోతున్నాయి. పల్లం ప్రాంతంలో సాగు చేస్తున్న పత్తి చేను వర్షాలకు ఊటలెక్కడంతో పంట ఎర్రబారి చనిపోతోంది.

వానల కారణంగా చీడపీడల బాధ విపరీతంగా పెరిగిపోయింది. ఆకుముడత తెగులుతో పాటు పత్తి పంటకు దోమతో పాటు పలు రకాల పురుగులు ఆశించడంతో పంట ఎదుగుదల లేక రైతు దిగాలు పడుతున్నాడు. పూత దశలో ఆరోగ్యంగా ఉండాల్సిన పత్తికి తెగుళ్లు, పురుగులు ఆశించడంతో



వర్షాలకు నీరు పట్టడంతో ఎదుగుదల లేని పత్తి పంట

ఎక్కువ కాయలు కాసేందుకు అవకాశం లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మందులు పిచికారీ చేశాక వానలు కురవడంతో ఆ ఖర్చు కూడా వృథా అయిపోయింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా అందకపోవడం వారిని ఇంకా కలవరపెడుతోంది. అధికారులు స్పందించి పత్తి రైతులకు సూచనలు సలహాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

పెట్టుబడులు పెరిగాయి

వానల వల్ల పెట్టుబడులు పెరిగాయి. మందు పిచికారీ చేసే సమయంలోనే వానలు పడ్డాయి. దీంతో అంతా నీటి పాలైంది. పెట్టుబడి రెండింతలవుతోంది.

– ఎ.రామకృష్ణ, పత్తి రైతు, కొత్తూరు

వర్షాలు దెబ్బ కొట్టాయి



వర్షాల వల్ల పత్తికి గట్టి దెబ్బ తగిలింది. పిందెలు రాలిపోవడం, కాయలు కుళ్లిపోవడం జరుగుతోంది. దీంతో నష్టం తప్పడం లేదు.

– ఎల్.గోవిందరావు, రైతు, కొత్తూరు

అవగాహన కల్పిస్తున్నాం



తుఫాన్‌కు నష్టపోయిన పత్తిని కాపాడుకోవడానికి రైతులకు సూచనలు అందిస్తున్నాం. ప్రస్తుతం అంతా పిందె, పూత దశలో ఉన్నందున అవసరమైన మందులు వాడాలని వ్యవసాయ సహాయకులు రైతులకు చెబుతున్నారు.

– స్వర్ణలత, వ్యవసాయ అధికారి, కొత్తూరు మండలం

క్రీడలకు ప్రాధాన్యత



వర్సిటీలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ కమిటీ సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వీసీ కేఆర్ రజిని తెలిపారు. వర్సిటీ పాలక మండల సమావేశ మందిరంలో గురువారం స్పోర్ట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిగ్రీ, పీజీ, వృత్తి విద్యాకళాశాల నుంచి అర్హులైన క్రీడాకారులను అంతర్రాష్ట్ర, విశ్వవిద్యాలయం పోటీలకు పంపాలని అన్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. అర్హత గల ప్రతిభ గల క్రీడాకారుల ఎంపిక జరగాలని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.సుజాత, పీడీలు, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత హామీ లేకుంటే ఆందోళన



బేవరేజెస్ గోదాం ముందు అన్‌లోడ్ కోసం ఉన్న మద్యం లారీలు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రైవేట్ మద్యం విధానం ఈ నెల 12వ తేదీ నుంచి తెరపైకి తెచ్చే ప్రయత్నం ప్రభుత్వం ప్రారంభించగా, ప్రస్తుతం నడుస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాలు ఎక్సైజ్ శాఖ అధికారుల ఒత్తిడితో నిర్వహిస్తున్నారు. జిల్లాలో 193 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సూపర్ వైజర్, సేల్స్ మెన్‌లు, నైట్ వాచ్‌మెన్‌లు అక్టోబర్ 1 నుంచి విధులకు హాజరుకాబోమని తెలిపారు. అయితే వారిపై ఒత్తిడి తెచ్చి మరీ అధికారులు పనిచేయిస్తున్నారు. ఈ నెల 5వ తేదీన రాష్ట్రస్థాయిలో ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ యూనియన్ అధికారులతో చర్చలు నిర్వహించనుంది. ఉద్యోగ భద్రతపై హామీ ఇవ్వకపోతే ఆరో తేదీ నుంచి విధులు బహిష్కరించి ఆందోళన చేయాలని నిర్ణయించినట్లు ఈ యూనియన్ ప్రతినిధులు తెలియజేస్తున్నారు. మరో పక్క ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎచ్చెర్ల గోదాం నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్న వాహనాలకు బకాయిలు ఇంకా చెల్లించలేదు.

విద్యార్థి కంటికి గాయం



కంటికి గాయం చూపుతున్న విద్యార్థి కుమార్

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పెసరపాలెం గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి కుమార్‌ను టీచర్ కర్రతో కొట్టడంతో కంటికి గాయమైంది. హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు టి. శోభారాణి తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ నెల 1వ తేదిన సాయంత్రం 3.45 సమయంలో అరుణ్ కుమార్ అనే తెలుగు ఉపాధ్యాయుడు కర్రతో కొట్టడం వల్ల కర్రముక్క విరిగి కంటికి గాయమైనట్లు వెల్లడించారు. విద్యార్థి కన్ను ఎర్రగా మారటంతో సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి, తదుపరి విజయనగరం ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. కంటిలో చిన్న కర్రముక్క గుచ్చుకుందని, రక్తస్రావం అవుతుండడంతో విశాఖపట్నంలోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని విజయనగరం వైద్యులు రిఫర్ చేసినట్లు తెలిపారు. అక్కడ ప్రస్తుతం ఆ విద్యార్థి చికిత్స పొందుతున్నాడని హెచ్‌ఎం శోభారాణి తెలిపారు. ఈ అంశంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని నవయానం బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ తెలిపారు.

వసతులు నిల్.. మోసాలు ఫుల్

- పెట్రోల్ బంకుల వద్ద వసతులు కరువు
- కనీస ప్రమాణాలు పాటించని బంకు యజమానులు
- పట్టించుకోని అధికారులు



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని పలు పెట్రోల్ బంకులు మోసాలకు కేరాఫ్‌లుగా మారుతున్నాయి. దీనికి తోడు కనీస సదుపాయాలు కూడా కల్పించడం లేదు. ప్రజలు పట్టించుకోకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారి ఆగడాలు సాగిపోతున్నాయి. నిబంధనలు పాటించని వారి వల్ల అందరికీ చెడ్డపేరు వస్తోంది.

మోసాలు ఇలా..

జిల్లాలో 127 పెట్రోల్ బంకులు ఉండగా.. అందులో కొన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధనం కల్తీపై ఎప్పటి నుంచో ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీకాకుళంలో ఓ బంకు వద్ద ఇలాంటి పరిస్థితి ఎదురుకాగా ఉన్నతాధికారుల వరకు విషయం వెళ్లింది. జలుమూరు మండలంలో ఒక పెట్రోల్ బంక్ వద్ద అయితే జనమే నిరసన తెలిపారు. దీనికి తోడు కొలతలపైనా చాలా అనుమానాలు ఉన్నాయి. ముందుగా చెల్లించిన డబ్బుకి ఫీడ్ చేసి ఆయిల్ నింపుతారు. దీని వల్ల కూడా స్పీడు ఎక్కువగా పెట్టడం, పాయింట్ ఆయిల్ విడుదల కంటే ఎక్కువగా మీటరు రీడింగ్ చూపించడం జరుగుతున్నాయి. దీనికి బంక్ యజమానులు వేరే కారణాలు చెబుతున్నా వినియోగదారుడు మాత్రం నష్టపోతున్నాడు.

వసతులు లేవు..

పెట్రోల్ బంకుల్లో వసతులు భూతద్దం పెట్టి వెతికినా కనిపించవు. మరుగుదొడ్లు ఏర్పాటు చేసిన వాటికి తాళాలు వేసేస్తున్నారు. వినియోగదారులకు సేవలు అందడం లేదు. టైర్లకు గాలి పెట్టే మెషీన్లు ఉన్నా.. అక్కడ ఎవరినీ పెట్టడం లేదు. ఫైర్ అయినప్పుడు ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు తొలి ప్రయత్నంగా వాడే ఫైర్ సేఫ్టీలు, అలాగే అక్కడ ఉండే వారికి ఇబ్బంది, అక్కడకు వచ్చే కస్టమర్లకి సేవలు అందించేందుకు ప్రథమ చికిత్స కిట్లు, ఫిల్టర్ పేపర్ లాంటివి ఏర్పాటుచేయాల్సి ఉన్నా.. ఏవీ కనిపించవు. తాగునీరైనా పెట్టని వారు ఎంతో మంది ఉన్నారు.

చట్టాలు కఠినంగా ఉన్నాయి



వినియోగదారులకు చట్టాలు అనుకూలంగా ఉన్నాయి. బంకు యజమానులు వినియోగదారుడిని మోసం చేస్తే, వెంటనే ఫిర్యాదు చేయాలి. ప్రధానంగా ఈ ఫిర్యాదు సివిల్ సప్లై అధికారులు, తూనికలు కొలతల అధికారులు, వినియోగదారుల సమాఖ్యకు, లేదా నేరుగా వినియోగదారులు న్యాయస్థానంలో ఫిర్యాదు చేయాలి.

– బగాది రామ్మోహన్ రావు, జిల్లా వినియోగదారులు సమాఖ్య అధ్యక్షుడు

పర్యవేక్షణ కరువు..

పెట్రోల్ బంకులపై నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన సివిల్ సప్లై అధికారులు, తూనికలు కొలతల అధికారులు, విజిలెన్సు అధికారులు, ఫైర్ ఇతర అధికారులు పర్యవేక్షణ చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో బంకు యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

అరసవల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం చేసే దిశగా రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పనిచేస్తుందని ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మొదలైన మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఆర్ వ్యవస్థపై అవగాహన కోసం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. సాధారణ కనీస పరిపాలన విధాన చట్టం –1994 ప్రకారం గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, లేఅవుట్ ప్లాన్, బిల్డింగ్ రెగ్యులరైజేషన్, స్థానిక సంస్థల ఆస్తుల పరిరక్షణ, వీధి దీపాల నిర్వహణ, విద్యుత్ బిల్లుల నిర్వహణ, ఆదా, ఆర్థిక నిర్వహణ, చట్టపరమైన అంశాలపై అక్షరాస్యత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్య శాసనాలు, సాంఘిక సంక్షేమ పథకాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లుగా ఆయన వివరించారు. ఈ శిక్షణలకు పంచాయతీరాజ్‌లో వివిధ క్యాడర్లలో 11 మందిని ఎంపిక చేశామని, వీరంతా పంచాయతీల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, డీపీఓ టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసా....గుతున్న రెవెన్యూ బదిలీలు

- ఇప్పటికీ బదిలీలకు నోచుకోని డీటీ, వీఆర్‌ఓలు
- 61 మంది సీనియర్ అసిస్టెంట్లకు బదిలీ



శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ శాఖలో బదిలీలు ఒక పెద్ద ప్రహసనంగా మారాయి. గత నెల 22తో పూర్తి కావాల్సిన బదిలీలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. రెండు రోజులకు ఒక కేడరు వంతున బదిలీలు చేస్తున్నారు. రాజకీయ సిఫార్సుల వల్లనే ఈ జాప్యం అనివార్యమవుతోంది. కూటమి నాయకులు ఒకే చోటకు ఇద్దరు, ముగ్గురికి సిఫార్సులు ఇస్తుండడం గమనార్హం. కొన్ని చోట్లకు కలెక్టరేట్ ఎ సెక్షన్ సిబ్బందే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రెవెన్యూ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సెక్షన్‌లో గతం నుంచి విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులు ఈ బదిలీల్లో కీలకంగా మారారు. ముందుగా వారు కుదుర్చుకున్న బేరసారాలకు అనుకూలంగా జాబితాలు తయారు చేస్తున్నారు. నిబంధనలు కూడా పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 'ఎ' సెక్షన్ నుంచి ఉద్యోగులకు ఎలాంటి సమాచారం అందడం లేదు. ఒక రోజు చెప్పిన మాటలు మరో రోజుకి మారిపోతున్నాయి. ఇప్పటి వరకు జరిగిన బదిలీల ఉత్తర్వులు సైతం గత నెల 22వ తేదీతో అంటే బ్యాక్ డేట్ పోస్టింగ్ ఇస్తున్నారు. ఈ సీనియర్ ఉద్యోగుల కారణంగానే ఇలా జరుగుతోందని రెవెన్యూ ఉద్యోగులంటున్నారు. ఇటీవల జరిగిన తహసీల్దార్ బదిలీల్లో పరిపాలన సెక్షన్‌లో ఏఓను మార్చారు. అయితే ఆ సెక్షన్‌లో ఉద్యోగులను మార్చకపోవడంతో ఆ సెక్షన్ పరిపాలన మళ్లీ మొదటికి వచ్చింది. ఇంకా బదిలీలు ఆలస్యమైతే జీతాల సమస్యలు వస్తాయని ట్రెజరీలో కొర్రిలు సరిచేసే సరికి నెల జీతం సకాలంలో వచ్చే పరిస్థితి ఉండదని రెవెన్యూ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

నిబంధనలు బేఖాతరు

ఒక సీనియర్ అసిస్టెంట్ గత పదేళ్లుగా డిసిప్లినరీ కేసులో ఉన్నారు. ఈ కేసును పరిష్కరించాల్సిన ఎ సెక్షన్ గుమస్తా, ఏఓలు ఇప్పటి వరకు పరిష్కరించలేదు. నిబంధనల మేరకు ఆ ఉద్యోగికి ఆ కేసును పరిష్కరించిన తర్వాత బదిలీ చేయాలి. ఆ నిబంధన కూడా పాటించకుండా జూనియర్ అసిస్టెంట్ కేడరులో బదిలీ చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులను ఈ సెక్షన్ సిబ్బంది తప్పుదోవ పట్టిస్తున్నారు, గతంలో జరిగిన ఏ బదిలీల్లోనూ ఇలా జరగలేదు. దీనిపై కూడా ఉద్యోగుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

డిప్యుటేషన్లకు ప్రయత్నాలు

ఇంకా బదిలీలు పూర్తిగా జరగనే లేదు. అప్పుడే అధికారులపై ఒత్తిళ్లు ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రాన్ని విడిచిపెట్టి వెళ్లేందుకు ఇష్టం లేని పలువురు అధికారులు వారికి బదిలీ అయిన చోటున విధుల్లో చేరకుండానే డిప్యుటేషన్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే జేసీ, కలెక్టర్లపై ఒత్తిడి తీసుకు వస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వారికి బదిలీలు చేయడం ఎందుకని రెవెన్యూ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

61 మంది సీనియర్ అసిస్టెంట్లకి బదిలీలు

రెవెన్యూ విభాగంలో తాజాగా గురువారం 61 మంది సీనియర్ అసిస్టెంట్లకి బదిలీలు చేశారు. వారిలో చాలా మంది దరఖాస్తు చేయనివారు, ఐదేళ్లు పూర్తి కాని వారు ఉన్నారు. వాస్తవానికి సీనియర్ అసిస్టెంట్ కేడరులో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారు 32 మంది ఉన్నారు. ఒకే చోట ఐదేళ్లు పూర్తయిన వారు 18 మంది ఉన్నారు. వీరంతా కలిపి 50 మంది మాత్రమే బదిలీలకు అర్హులు. అయితే ఈ సారి బదిలీల్లో 61 మందికి బదిలీలు చేయడం గమనార్హం. ఇంకా ఈ విభాగంలో డీటీ, వీఆర్‌ఓ కేడర్లు బదిలీలు చేయాల్సి ఉంది.

రైతు సంఘాల నిరసనకు కాంగ్రెస్ మద్దతు

శ్రీకాకుళం అర్బన్: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రైతు సంఘాలు చేపట్టిన నిరసనకు మద్దతుగా డీసీసీ అధ్యక్షులు అంబటి కృష్ణారావు గురువారం ఆందోళనలో పాల్గొన్నారు. ఇందిరాగాంధీ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేశారని, వేల ఎకరాల భూములు సేకరించి అద్భుతమైన విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టిన తర్వాత ఎంతో మందికి ఉపాధిని కల్పించిందన్నారు. దేశంలో పరిశ్రమలు స్థాపించడం మానివేసి లాభాల బాటలో ఉన్న పరిశ్రమలను నష్టాల బాటలో చూపించి వాటిని ప్రైవేటీకరణ పేరుతో బడా పారిశ్రామికవేత్తలకు కారు చౌకగా అమ్మేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే ఎన్నో పోర్టులను అదానీ, అంబానీ గ్రూపులకు కారుచౌకగా అమ్మేశారని తెలిపారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆకస్మిక మరణం



మోహనరావు (ఫైల్)

నరసన్నపేట: ఎక్సైజ్ కానిస్టేబుల్ జలుమూరు మోహనరావు (33) ఉద్యోగంలో చేరడానికి వెళ్తూ తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందారు. నరసన్నపేట ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మోహనరావుకు పాతపట్నం బదిలీ అయింది. బదిలీ ఉత్తర్వులు తీసుకున్న వెంటనే నరసన్నపేటలో రిలీవ్ అయి పాతపట్నంలో జాయిన్ అవడానికి ఆర్టీసీ బస్సులో గురువారం వెళ్తుండగా సారవకోట వద్దకు వచ్చేసరికి అనారోగ్యానికి గురయ్యాడు. బస్సులో ఉన్న ప్రయాణికులు వెంటనే సపర్యలు చేశారు. అయినా ఫలితం లభించలేదు. పాతపట్నం వెళ్లిన వెంటనే ప్రయాణికులే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికి తీవ్ర జ్వరంతో బాధ పడుతున్న మోహనరావుకు సుగర్ కూడా బాగా డౌన్ అయింది. పరిస్థితిని గమనించిన వైద్యులు షణ్ముఖరావు వైద్యం అందించేలోపే మోహనరావు ప్రాణాలు విడిచాడు. ఎచ్చెర్లకు చెందిన మోహనరావు స్థానిక కోవెల వీధిలో భార్య మౌనిక, కుమార్తె పర్నికతో కలిసి అద్దె ఇంటిలో ఉంటున్నారు. దీనిపై ఎక్సైజ్ ఎస్ఐ గురుమూర్తి మాట్లాడుతూ వారం రోజులుగా జ్వరంతో బాధ పడుతున్నాడని, జ్వరం తగ్గిన తర్వాత వెళ్లి జాయిన్ కావాలని సూచించామని, అయినా వినకుండా జ్వరంతోనే పాతపట్నం వెళ్లాడని అన్నారు. ఆయన మృతి సమాచారం తెలియగానే బాధపడ్డామన్నారు.